

వివరాలు మెయిన్‌లో

## రిజర్వేషన్లలో దేశవ్యాప్తంగా బిసిలకు అన్యాయం


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 14 అక్టోబరు , 2026 | పేజీలు : 4


# ఆధార్ సేవలు వేగవంతం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలోని ప్రజలందరికీ ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఇందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని వయసుల వారి ఆధార్ నమోదు శాతాన్ని పెంచడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని,జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆధార్ జనరేషన్ ప్రక్రియ వేగాన్ని పెంచాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.5 సంవత్సరాలు , 15 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న పిల్లలకు ఉచితంగా నిర్వహించే తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియపై విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్ల స్థితిగతులను, వాటి పనితీరును ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ సమీక్షించారు.సాంకేతిక సమస్యలు ఉన్న కిట్లను వెంటనే బాగు చేయాలని సూచించారు. అదనపు ఎస్‌పి రమేష్,జిల్లా విద్యాశాఖాధికారి సు సింధర్ రావు,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దశ్రు నాయక్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాహుల్, పోస్టల్ సూపరింటెండెంట్,లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గారావు, ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్, మీసేవ ఏవో రాజశేఖర్,మీసేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి, సీఎస్సీ డీఎం ముక్కురామ్ హాజరయ్యారు.

# ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల్లో పోలీసు అధికారులు తీసుకున్న ప్రత్యేక చొరవతో పురోగతి సాధించడం అభినందనీయమన్నారు. కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులను స్వయంగా కలువాలని సూచించారు. ఫోక్సో యాక్ట్ కేసుల్లో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దొంగతనాల నివారణ రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థ, నిఘా వ్యవస్థలను పటిష్ట పరుచాలన్నారు. పండుగ వేళల్లో ప్రజలను చైతన్యం చేసి దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దసరా పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకునేలా చూడాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది కనపర్చిన ప్రతిభను గుర్తించి ప్రశంసాలు, ప్రోత్సాహకాలు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్ అలీ, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, నాగేశ్వరరావు, రాజశేఖర్‌తోపాటు ఐటి కోర్, భరోసా టీం ఎస్‌ఐలు పాల్గొన్నారు.



# నిత్యం 'తాళం'తో విద్యుత్ కార్యాలయం!


వివరాలు మెయిన్‌లో

### అందుబాటులో లేని అధికారులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం,కరెంటు సమస్యలు తలెత్తినా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి

## బిసి-ఎ జాబితాలో చేర్చే ప్రయత్నాలను విరమించుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**బీసీఏ జాబితాలో ఇతర కులాలను చేర్చి ఇప్పటికే ఆ జాబితాలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాలు,సంచార, అర్ధసంచార తెగలకు అన్యాయం చేయవద్దని తెలంగాణ బెస్త సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు ప్రభుత్వాలను కోరారు. కులాల సామాజిక,ఆర్థిక వెనుకబాటుతనాన్ని సమగ్రంగా పరిశీలించకుండా ప్రభుత్వాలు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అభివృద్ధి చెందిన కులాలను బీసీఏ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తే, బీసీఏ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.బీసీఏ జాబితాలో ఇప్పటికే అనేక కులాలు ఉన్నాయని,వాటిలో సంచార,అర్ధసంచార తెగలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాలు విద్యా, ఉద్యోగ,ఆర్థిక,సామాజిక రంగాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ఆయా కులాలు ఇప్పుడిప్పుడే సామాజిక చైతన్యం పొందుతూ విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందడుగు వేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అంబటి అంజయ్య, బొమ్మరబోయిన అంజయ్య,యాదగిరి,వెంకటేష్ పాల్గొన్నారు.

## సాగర్‌లో క్యాన్సర్ కట్టడికి ముందడుగు

### తొలిరోజే 220 మందికి వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/ నందికొండ:** క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో నాగార్జునసాగర్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.రోటరీ క్లబ్ నాగార్జునసాగర్ సౌజన్యంతో,హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో రెండు రోజులపాటు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని మంగళవారం నాగార్జునసాగర్ డ్యామ్ ఎస్ఈ మల్లికార్జునరావు ప్రారంభించారు.శిబిరం తొలిరోజే 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం విశేషం.క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు,వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ నాగార్జునసాగర్ ప్రతినిధులు, కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి వైద్యులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో ఫైవ్ స్టార్ హోటళ్లకు స్థలాల గుర్తింపు


వివరాలు మెయిన్‌లో



## రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడు మృతి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో రిక్షా కార్మికుడు రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రిక్షా కార్మికుడు రమణయ్య (70) రోజువారి పనిలో భాగంగా తన రిక్షాపై ఉల్లిగడ్డల బస్తావేసుకుని రోడ్డు దాటుతుండగా, నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ పాఠశాలకు చెందిన బస్సు ముందుభాగం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహన్ని పంచనామ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అన్నిదానాల్లో కన్న అన్నదానం చాల గొప్పదని రిటైర్డ్ ఉపాధ్యాయులు సాముల శ్రీనివాసరెడ్డి, అందె సత్యనారాయణలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు అరవింద్‌రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కటకం లక్ష్మి నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/చింతపల్లి** : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగ పని చేస్తానని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తీదేడు గ్రామ పంచాయతీలో ఆ గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్నశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్నశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని ఆమె అన్నారు. ఈ గ్రామసభలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామ ఉప సర్పంచ్ఉడబోయిన వెంకటయ్య యాదవ్, ఉలుపాల శేఖర్‌రెడ్డి, రమణారావు, వార్డు సభ్యులు పార్వతమ్మ యాదగిరి, కృష్ణ అలివేలు, రెడ్డి పద్మ, లక్ష్మయ్య, యాదగిరి, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల చేయాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల బరువు కింద విద్యార్థుల, అధ్యాపకుల బతుకులు నలగకూడదని ప్రైవేటు కళాశాల యాజమాన్యం, విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ కోరారు. మంగళవారం సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావును కలసి విద్యార్థులు, డిగ్రీ, పిజి కళాశాలల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం చూపిన అలసత్వం కారణంగా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు రావాల్సిన ఉద్యోగాలు, కొలువులు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకునే విద్యార్థుల ఆశలు కూలిపోతున్నాయని, రెక్కల ముక్కలు చేసుకుని చమటోడ్చిన తల్లిదండ్రుల కష్టం నీరుగారిపోతోందని తెలిపారు.చదువుకునే పసి మనసులు నైరాశ్యం చెందకుండా, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు అప్పుల కోరల్లో చిక్కుకోకుండా, అధ్యాపకుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే బకాయిలను వెంటనే సకాలంలో విడుదల చేసేలా అసెంబ్లీలో, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిపిఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు డిగ్రీ, పిజి కళాశాలల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధు, పాపయ్య, హరి, వీరయ్య, బాలాజీ పాల్గొన్నారు.

# ఒకే ఇంట్లో రెండు పోలీస్ ఉద్యోగాలు

### అక్క డిఎస్‌పి, తమ్ముడు ఎస్ఐ



**ప్రజాపక్షం/అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన సట్టు అచ్చయ్య సీతమ్మ ల కుమార్తె డిఎస్‌పి, కుమారుడు ఎస్ఐ లతో ఇద్దరు కూడా పోలీస్ ఉద్యోగాలు సాధించారు. కుమారుడు సట్టు వినయ్ ప్రస్తుతానికి ఉప్పల్ ట్రైనింగ్ ఎస్ఐగా విధులు నిర్వహించుచున్నారు. అలాగే సట్టు భవాని గ్రూప్1లో డిఎస్‌పి గా ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇద్దరు తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. ఆర్థికంగా బీదవారైనా వారి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివించారు. పేదరికం సదుపాయాల లోపు ఉన్న పట్టుదలతో చదువుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. వారి విజయం తల్లిదండ్రుల త్యాగానికి పిల్లల కృషికి ఉన్న ఫలితం ఇది పేద కుటుంబాల పిల్లలకు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధించగలమని స్ఫూర్తినిచ్చే ఉదాహణ. గ్రామానికి చెందిన తెచ్చిన అక్కా తమ్ముడికి స్నేహితులు గ్రామ ప్రజలందరూ కూడా పుష్కలమైన అభినందనలు ఎస్ఐ వినయ్ మొదటి నుండి క్రీడల పట్ల మక్కువ చూపేవాడు. క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ఈ రోజు ఈ స్థాయికి రావడం వారి స్నేహితులు వినయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హుజూర్‌నగర్‌లో ఆక్రమణదారులపై పోలీసుల కొరడా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై పోలీసులు కొరడా ఘుళిపిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలనే లక్ష్యంతో ఆక్రమణలపై కఠిన చర్యలు చేపడుతున్నారు. సిఐ చరమందరాజు అదేశాల మేరకు ఎస్ఐలు చలికంటి నరేష్, హనుమానాయక్ ల ఆధ్వర్యంలో పోలీసులు చర్యలను ముమ్మరం చేశారు.

**రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి**

పట్టణంలోని రహదారులపై తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమంచి వ్యాపారాలు నిర్వహించడం, దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి చర్యలపై పోలీసులు దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చలానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. మంగళవారం పాత్ బస్టాండ్ సమీపంలో జరిగిన వృద్ధుడి మృతి ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రహదారులపై అక్రమణల కారణంగా పాదచారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు నడిచేందుకు కేటాయించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని సూచిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నో అంటే ఖాతా ఖాళీ..!

**సైబర్ నేరగాళ్ళు సరికొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు : జిల్లా ఎస్‌పి కె. నరసింహ**

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుంటూ ప్రజలను మోసం చేసేందుకు సరికొత్త పద్ధతులను అనుసరిస్తున్నారని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని నంబర్ల నుంచి వాట్సాప్‌కు వచ్చే అనుమానాస్పద సందేశాలకు స్పందించవద్దన్నారు. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ళు మొదట గుర్తు తెలియని నంబర్ల నుంచి బాధితుల వాట్సాప్‌కు మీ బ్యాంక్ ఖాతా నుంచి కొంత నగదు డెబిట్ అయింది ఈ లావాదేవీ చేయకపోతే వెంటనే నో అని రిప్లై ఇవ్వడం అంటూ సందేశాలు పంపుతున్నారని చెప్పారు. ఖాతా నుంచి డబ్బులు పోయాయనే ఆందోళనతో బాధితులు వెంటనే స్పందించేలా ప్రయత్నిస్తున్నారని ఇలాంటి సందేశాలకు స్పందించడం వల్ల సైబర్ ముప్పు ఉండవచ్చని, ముఖ్యంగా సందేశాలతో పాటు వచ్చే అనుమానాస్పద ఫైళ్లు, లింక్‌లు లేదా ఇతర కంటెంట్‌ను తెరవడం వల్ల మొబైల్ ఫోన్ భద్రతకు ముప్పు ఏర్పడవచ్చని హెచ్చరించారు. మీ ఫోన్ హ్యాక్ అవుతుందని, అకౌంట్‌లో నగదు పోతుందన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల నగదును నిలిపివేసేందుకు, తిరిగి పొందేందుకు అవకాశం పెరుగుతుందని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.



## బతుకమ్మ పండుగకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో బతుకమ్మ పండుగకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యుఓ నరసింహారావు, ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు రవి తేజ, అనూష, డిఎస్‌డిఓ వెంకటరెడ్డి, అడిషనల్ పిడి సురేష్, జిఎం ఇండస్ట్రీస్ భారతి పాల్గొన్నారు.

## 15న మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వ్యవసాయ మార్కెట్ క మిటి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంను ఈనెల 15న నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటి ఐదో పాలకవర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. చైర్‌పర్సన్‌గా చలసాని స్పందన, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్‌రెడ్డితో పాటు వీరితో పాటు 12 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా కృషిచేయడం, మార్కెట్ కమిటి అభివృద్ధికి చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాసంగిలో వరి సాగుకు రైతులు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/చండూరు:** ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్న కారణంగా యాసంగిలో వరి సాగు పంటకు రైతులు దూరంగా ఉండాలని చండూరు మండల వ్యవసాయ అధికారి మల్లేశం రైతులకు సూచించారు. మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి మండలంలోని తుమ్మలపల్లి , చామలపల్లి గ్రామాలలో ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన వరి, పత్తి పంటలను ఏఓ మల్లేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా యాసంగి సీజన్‌లో వర్షపాతం తగ్గి నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి సర్పంచ్ బోయపల్లి రాజేష్ గౌడ్ , చామలపల్లి సర్పంచ్ ముదిగొండ ఆంజనేయులు , వ్యవసాయ విస్తరణ అధికారులు నాగార్జున , మహేష్ , రైతులు పాల్గొన్నారు.





## ఢిల్లీ కాంగ్రెస్ నిరసనలో వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్** : కేంద్ర ఎన్నికల కమిషనర్ బ్రిజేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నిన్న ఢిల్లీలో సుప్రీంకోర్టు వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి రోడ్డుపై బైఠాయించిన నాయకులు ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు , ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ ర్యాలీలో పాల్గొని నిరసన తెలిపారు.ఈసీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా విచ్చేసిన కాంగ్రెస్ కీలక నేతలు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొనడంతో ఢిల్లీ వీధులు నినాదాలతో హోరెత్తాయి.

## లబ్ధిదారులకు పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/మునగాల:** ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ కాంపాటి వెంకట్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడివో నరేష్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అశోక్ కుమార్తె అక్షర పేరుపై రూ.70 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యుత్ షాక్‌తో మృతి చెందిన లావుడి అశోక్ కుటుంబానికి లావుడితండ ఉద్యోగుల సంఘం ఆర్థిక భరోసా కల్పించింది. మంగళవారం అశోక్ కుమార్తె అక్షర భవిష్యత్తుకు అండగా నిలిచేందుకు ఆమె పేరుపై రూ.70 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ డిపాజిట్‌కు సంబంధించిన ధ్రువపత్రాన్ని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లావుడి జగన్, ప్రధాన కార్యదర్శి కోట వరలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లావుడి తండ సర్పంచ్ శ్రీహరి, సంఘం నాయకులు కోట, హరి, సెట్య, రవి, వెంకట్రాం, జగన్, గ్రామ పెద్దలు పకీరా, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



## అశోకుడి ధమ్మ మార్గం..అంబేద్కర్ దీక్షా స్ఫూర్తి



**బుద్ధవనంలో నేడు ధమ్మ విజయ వేడుకలు**

ప్రజాపక్షం/నందికొండ : చరిత్రను స్మరించుకుంటూ బౌద్ధ ధమ్మ ఆశయాలను చాటిచెబుతూ నాగార్జునసాగర్ లోని అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనం నేడు ధమ్మ విజయ వేడుకలకు వేదిక కానుందని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు.సుమారు 2,300 ఏళ్ల క్రితం మౌర్య చక్రవర్తి అశోకుడు బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించిన చారిత్రక నేపథ్యంతో పాటు, 1956 అక్టోబర్ 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాగ్ పూర్‌లో బౌద్ధ ధమ్మ దీక్ష తీసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బౌద్ధాభిమానులు ధమ్మ విజయ దినోత్సవాన్ని జరుపుకుంటారని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ రెండు చారిత్రక ఘట్టాలు ప్రసరించిన సామాజిక మార్పు,ధమ్మ సందేశాన్ని స్మరించుకునేలా బుద్ధవనంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.బుధవారం ఉదయం 10గంటలకు ఆయన ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో థాయ్ లాండ్ బౌద్ధ గురువులు,ధమ్మయాత్రకు నాయకత్వం వహించిన ఫా సాంగ్ సక్ కొవిడో, ఆంధ్రప్రదేశ్ సంగారామ విహారానికి చెందిన సిద్ధార్థ బంతేజీ,ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫసర్ ఆడెపు సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించనున్నారు.ఈ వేడుకలకు బౌద్ధాభిమానులు,ధమ్మ అనుచరులు,స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లక్ష్మయ్య కోరారు.

## 22న దళిత క్రైస్తవ అవగాహన సదస్సును విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :యునైటెడ్ దళిత క్రిస్టియన్ ఫడరేషన్ (యుడిసిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 22న మిర్యాలగూడలో జరిగే దళిత క్రైస్తవ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని యుడిసిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దమాము డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు.మంగళవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను,దళితుల పట్ల వివక్షను తీవ్రంగా ఖండించారు.క్రైస్తవ సమాజాన్ని వ్యతిరేకంగా చూపిస్తూ పాస్టర్లపై భౌతిక దాడులు, చర్చిల్లోకి చొరబడి దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాజం అండ లేకుండా ఉందని, పక్షాన నిలబడే వారు, రక్షణ కల్పించే వారు లేకుండా పోయారని,ఐక్యత లోపించి విడిపోయి ఉండటం వల్ల క్రైస్తవ్యం ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు.ప్రేమతో,సేవతో సమాజంలోకి వచ్చిన క్రైస్తవ్యానికి ఒకప్పుడు ఉన్న మంచి పేరు స్వార్థం,ఐక్యత లోపంతో దెబ్బతింటోందన్నారు.దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలనే దృఢ సంకల్పంతో ఏర్పాటు చేస్తున్న ఈ సదస్సుకు ప్రొఫసర్ కాశీం ముఖ్య అతిథిగా హాజరవుతారని,అలాగే ప్రముఖులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,రావెల కిషోర్,రాజీవ్ సాగర్,నతనియేలు తదితరులు హాజరవుతారని తెలిపారు.క్రైస్తవులు,పాస్టర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుడిసిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పుతో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి



**ప్రజాపక్షం/కోదాడ:** రైతులకు సాగునీరు అందక, విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు చేష్టలుడిగ చూస్తున్నారని త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించి, వాళ్ల కళ్లు తెరిచే విధంగా బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని ప్రభుత్వానికి ముందస్తు జాగ్రత్త లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. అప్పులు చేసి వేసుకున్న పంటలు తమ కళ్లెదుటే ఎండిపోతుంటే చూస్తు ఊరుకోలేక డ్రమ్ములతో నీళ్లు తెచ్చి కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు హృదయ విధారకరమన్నారు. డెడ్ స్టోరేజీలో ఉన్న సాగర్ ప్రాజెక్టు నుండి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటిని ఖమ్మంకు తరలించకపోతుంటే జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిస్తేజంగా చూస్తున్నారు తప్పితే పంటలు కాపాడేందుకు ప్రయత్నం చేయకపోవడం రైతులను మోసం చేసినట్లేనన్నారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఎవరికి వారు కమిషన్ల పేరు మ ఈద అందినకాడికి కోట్లు దండుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌కె నయీం, చీమ నరేష్, కవిత, కరీ ముల్లాబాబా, భాగ్యమ్మ, ఉపేందర్‌గౌడ్, బత్తుల ఉపేందర్, అప్పారావు పాల్గొన్నారు.

## మంత్రి, ఎమ్మెల్యేల సహకారంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**ప్రజాపక్షం/నడిగూడెం:** విద్యుత్ సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల దృష్టికి విద్యుత్ సమస్యను మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ వారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మెగా 8ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని అన్నారు. కొద్దిరోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి గ్రామంలో, మండలంలో రైతులకు ప్రజలకు విద్యుత్ సమస్య ఏర్పడిందని తెలిపిన వెంటనే ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అధికారులతో మాట్లాడి సమస్యను తెలుసుకుని 8 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌పార్మర్ త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశాలు జారీ చేశారు. మంగళవారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో మండలంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను సర్పంచ్ దున్న శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుండు శ్రీనివాస్, విద్యుత్‌శాఖ అధికారి జివి గణేష్, ఎ.శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, గురుస్వామి శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెగా మ్యూజికల్ ఈవెంట్ అండ్ సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాలు2026 అవార్డుల సంబరాలు ఈ నెల 27న హైదరాబాద్ హిమాయత్ నగర్ మినర్వా కాఫీ షాప్ పక్కన వెస్ట్ సైడ్,శ్రీ వాసవి శ్రీముఖి కాంప్లెక్స్,సరేగమ మ్యూజికల్ ఈవెంట్స్ గ్రాండ్ బాంక్వెట్ హాల్ లో జరగనున్నాయని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరు విల్సన్ తెలిపారు.అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి గోల్డెన్ నంది అవార్డులు,సింహ అవార్డులు,ఇంటర్నేషనల్ ఇందిరా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఫ్రండ్ షిప్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్,ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్,జ్ఞాపిక,మెడల్, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తామని అన్నారు.ఆసక్తి గలవారు 20 వరకు వాట్సాప్ నంబర్ 9396610766 ద్వార రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## గురుకులాల నిత్యావసరాల టెండర్లు మహిళా సంఘాలకే ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్లను వెంటనే స్థానిక మహిళా సంఘాలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను సరఫరా చేయడానికి ప్రభుత్వం పిలిచిన కేంద్రీకృత టెండర్ విధానంలో భారీ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన నాకాఫ్ సంస్థకు మళ్లీ కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు కట్టబెట్టడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. దినపత్రికల్లో వెలువడిన ఆధార సహిత కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని ఆ సంస్థను తిరిగి బ్లాక్ లిస్టులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. బేషరతుగా నాకాఫ్ టెండర్లను రద్దు చేసి పారదర్శకతను కాపాడాలని కోరారు.అధికారులు లంచాల మత్తులో జోగుతూ ఎలాంటి అనుభవం లేని వ్యక్తులకు, సంస్థలకు సబ్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విమర్శించారు.

## డిజిటల్ చెల్లింపులపై రుసుముల భారం తగదు

**ప్రజాపక్షం/గుండాల;** దేశంలోని సామాన్య ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు మరియు చిన్న వ్యాపారుల రోజువారీ జీవితంలో భాగమైన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపిఐ)పై కొత్తగా ప్రకటించిన వ్యాపారి రుసుములు(ఎండిఆర్) భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గుండాల మండల కేంద్రంలో మాట్లాడుతూ డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం రూ. 2వేలకు మించిన వ్యక్తి వ్యాపారి లావాదేవీలపై 0.4శాతం వ్యాపారి రుసు ము, అలాగే రూ. 75వేలు లేదా అంతకంటే ఎక్కువ లావదేవీలపై గరిష్టంగా రూ. 300ల వరకు వర్తింపజేయడం దారుణమని అన్నారు. వ్యక్తిగత లావాదేవీలు రూ. 2వేలలోపు వ్యాపారి లావాదీవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికి ఈ రుసుముల విధానం భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీలో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ల సహకారంతో మిగిలిపోయిన అర్హత గల వారికి రాబోయే రోజుల్లో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడివో నరేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, గుండు లక్ష్మి నారాయణ, షేక్ అజీత్‌మియా, కేసగాని కామేశ్వరి, వెంకన్న, రేవూరి కళ్యాణి బాబు, మీసాల బిక్షం పాల్గొన్నారు.



